
సాక్షి పెద్దపల్లి

గురువారం । 30 । మార్చి । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.7,341

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి క్వింటాల్‌కు రూ.7,341 పలికింది. కనిష్టంగా రూ.6,517గా నమోదైంది.




మల్లన్న ఆలయం ముస్తాబు

ఓదెల: ఓదెల మల్లన్న స్వామి సన్నిధిలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, ఈవో సదయ్య తెలిపారు.

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు కొనసాగుతాయి. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.



అర్థరహితమైన మాటలకన్నా అర్థవంతమైన నిశ్శబ్దం చాలా గొప్పది.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు: 6:33	శుక్ర: 4:46

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అభివృద్ధి చేసి చూపిస్తాం



హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

గోదావరిఖని: కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ అన్నారు. హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా బుధవారం జీడీకే–5 ఓసీపీ, ఏరియా వర్క్‌షాప్, గాంధీనగర్‌లో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. తొమ్మిదేళ్ల దొరల పాలనలో ఏ ఒక్కరికీ ఇల్లు రాలేదని, కరెంట్ బిల్లులు మోత మోగుతోందన్నారు. రైతుల రుణమాఫీ జరగలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. సింగరేణికార్మికుల హక్కుల రక్షణ, సౌకర్యాలపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన సతీమణి మనాలిఠాగూర్, నాయకులు కాల్వ లింగ స్వామి, ముస్తఫా, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, గాధం విజయానంద్, తాళ్లపల్లి యుగేందర్, గట్ల రమేశ్, అనుమ సత్తి, విజయ్, నజీమోద్దీన్, కొమ్ము శ్రీనివాస్, సారంగపాణి, చుక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు రుణాలు

పెద్దపల్లిరూరల్: ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల వ్యవస్థీకరణ పథకం కింద స్వయం సహాయక సంఘాలకు 35శాతం రాయితీపై రుణాలు అందిస్తున్నట్లు డీఆర్‌డీవో శ్రీధర్ తెలిపారు. పథకం కింద ఫ్లోర్‌మిల్, బేకరీ, రైస్‌మిల్, పచ్చళ్ల తయారీ, ప్యాకింగ్ ఆయిల్‌మిల్ తదితర వ్యాపారాలు చేసుకోవచ్చని, రుణం పొందాలనుకునే వారు ఏప్రిల్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10శాతం వ్యక్తిగత వాటా చెల్లించడంతోపాటు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, కొటేషన్ వ్యాపార టర్నోవర్ ఉంటే రాయితీ వర్తిస్తుందని వివరించారు.

రాములోరి పెళ్లికి ఆలయాలు ముస్తాబు



పెద్దపల్లిరూరల్: శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. పెద్దపల్లి పట్టణం శాంతినగర్‌లోని శ్రీకోదండ రామస్వామి, శ్రీసీతారామస్వామి ఆలయంతోపాటు స్టేషన్ రోడ్డు తదితర హనుమాన్ ఆలయాలను అందంగా అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రాహుల్‌పై అనర్హత అప్రజాస్వామికం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే రీతిలో ప్రధాని మోదీ సర్కార్ పనిచేస్తోందని, రాహుల్‌గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికమని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాహుల్‌పై వేటుకు నిరసనగా మంథని ప్రధాన చౌరస్తాలో ప్రజాస్వామ్య పరిరక్షణ నిరసన దీక్ష చేపట్టారు. రాహుల్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకపోతున్నారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ భారత జాతిని ఏకం చేసేందుకు చేపట్టిన జోడోయాత్ర జీర్ణించుకోలేకపోయారన్నారు. అదానీ ఆస్తులపై జేపీసీ డిమాండ్ చేసినందుకే ఆయన సభ్యత్వం రద్దు చేశారని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేష్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఐత ప్రకాష్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

మురిసిన పల్లెలు..!

- జిల్లా ఏర్పాటు నుంచే పెద్దపల్లికి ప్రత్యేక గుర్తింపు
- తొమ్మిది అంశాల్లో పోటీపడుతున్న గ్రామాలు
- రాష్ట్రస్థాయిలో ఎంపికైన లక్ష్మీపూర్, గంగారం, సుల్తాన్‌పూర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లాకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాగా ఆవిర్భావం నుంచి కేంద్రం నిర్వహించే పోటీల్లో పాల్గొంటూ ప్రత్యేకత చాటుకుంటూ.. అవార్డులు అందుకుంటోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది అంశాల్లో చూపిన ప్రతిభ ఆధారంగా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించింది. ఇందులో జిల్లాలోని 27 పంచాయతీలు అవార్డులు అందుకున్నాయి.

తొమ్మిది అంశాలు..

జాతీయ పంచాయతీ అవార్డులు (నేషనల్ పంచాయత్ అవార్డ్స్) పేదరికంలేని, మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యకరమైన, బాలల స్నేహపూర్వక, సమృద్ధి నీటి లభ్యత, పచ్చదనం–శుభ్రత, స్వయం సమృద్ధి – మౌలిక సదుపాయాలు, సామాజిక సమన్యాయం – సురక్షిత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామం అంశాలపై దేశవ్యాప్తంగా పంచాయతీలు పోటీపడ్డాయి.

సుల్తాన్‌పూర్ టాప్..

ప్రజలకు పంచాయతీలు అందిస్తున్న సేవలను గుర్తించి మెరుగైన సేవలందించే పంచాయతీల పాలకులను ప్రోత్సహించేలా కేంద్రప్రభుత్వం అందిస్తున్న నేషనల్ పంచాయతీ అవార్డ్స్ కోసం జిల్లాలోని అన్ని పంచాయతీలు పోటీపడ్డాయి. అందులో పలు అంశాల్లో ప్రతిభను కనబర్చిన 27 పంచాయతీలను ఎంపిక చేసి అవార్డులను ప్రదానం చేసిన విషయం విదితమే. అందులో ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ పంచాయతీ నాలుగు అంశాల్లో ప్రతిభ చూపి అగ్రస్థానంలో నిలిచింది. రామగిరి మండలం నాగెపల్లి మూడు అంశాల్లో.. మంథని మండలం నాగారం, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి రెండేసి అంశాల్లో ప్రతిభ చూపాయి.



రాష్ట్రస్థాయిలో సుల్తాన్‌పూర్

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ పంచాయతీ థీమ్ 1, 2, 5, 9 అంశాల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో నిలిచింది. ఉపాధిహామీ పథకం, పీఎం కిసాన్, రేషన్ కార్డుదారులకు లబ్ధి, పీఎం జన్‌ధన్ యోజన, స్వశక్తిసంఘాలకు నూరుశాతం రుణాలందించేలా కృషి చేశారు. ఆరోగ్య సేవల్లోనూ ముందంజలో ఉంది. పచ్చదనం, పరిశుభ్రతలో ప్రత్యేకత చాటుకుంది. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి రక్తహీనత నియంత్రించడంలో కీలకంగా వ్యవహరించింది.

సమన్వయంతో ముందుకు



గ్రామంలోని ప్రజలందరి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధిమార్గాలు చూపి ప్రోత్సహిస్తున్నాం. అందరి సహకారంతోనే గ్రామానికి ప్రత్యేక గుర్తింపు దక్కింది.

– వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్, సుల్తాన్‌పూర్

పెద్దకల్వల పంచాయతీ



పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు బాలల స్నేహపూర్వక గ్రామంగా గుర్తింపు దక్కింది. గ్రామంలో ఐదేళ్లలోపు 187 మంది చిన్నారులున్నారు. వారికి పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్ వేశారు. ఆరేళ్లనుంచి 18ఏళ్లలోపున్న వారు 321 మంది పాఠశాలలకు వెళుతున్నారు. 87మందికి ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కిట్‌లు అందించారు.

సంతోషంగా ఉంది



గ్రామానికి జాతీయస్థాయి అవార్డు దక్కడం సంతోషంగా ఉంది. బాలల స్నేహపూర్వక గ్రామం అంశం ఆధారంగా అవార్డు వచ్చింది. బడీడు పిల్లలందరినీ బడికి పంపించడం, చిన్నారులు సహా పిల్లలందరికీ వ్యాక్సినేషన్ వేయించాం. గ్రామస్తులందరి సమష్టి సహకారంతో అవార్డు దక్కింది.

– కారెంగుల రమేశ్, సర్పంచ్ పెద్దకల్వల



ముత్తారం పంచాయతీ

పెద్దపల్లి మండలం ముత్తారం పేదరికంలేని మెరుగైన జీవనోపాధి అంశంలో అవార్డుకు ఎంపికైంది. ఉపాధి జాబ్‌కార్డులు పొందిన కూలీలందరికీ పని కల్పించారు. గ్రామంలోని 1487 మంది రేషన్‌కార్డుదారులు లబ్ధి పొందారు. పీఎం కిసాన్ యోజన పథకం అర్హులందరికీ అందింది. స్వశక్తి సంఘాల సభ్యులు 362 మందికి బ్యాంకు రుణాలందించారు.

సమష్టి కృషితోనే..



మా గ్రామానికి జాతీయ స్థాయి అవార్డు అందడం సంతోషంగా ఉంది. గ్రామస్థాయి అధికారులు, స్వశక్తిమహిళల సమష్టి సహకారం, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే గ్రామానికి గుర్తింపు దక్కింది.

– ఎద్దు కుమారస్వామి, సర్పంచ్, ముత్తారం



రాష్ట్రస్థాయిలో లక్ష్మీపూర్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని లక్ష్మీపూర్ పంచాయతీ సమృద్ధి నీటిలభ్యత అంశంలో రాష్ట్రస్థాయిలో అవార్డు సాధించింది. గ్రామంలో ఇంటింటికీ తాగునీటి వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత ఏర్పాటు చేశారు. ప్రతిరోజు క్లోరినేషన్ చేసిన తర్వాతే తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

గుర్తింపు దక్కడం సంతోషం



మా గంగారం పంచాయతీకి జాతీయ స్థాయి అవార్డు ఇచ్చి ప్రోత్సహించడం సంతోషంగా ఉంది. పాలక వర్గం, ప్రజల భాగస్వామ్యంతోనే అన్ని విధాలా ముందుకు సాగుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే సాధ్యమైంది.

– కొంకటి మల్లారెడ్డి, సర్పంచ్, గంగారం



గర్రెపల్లి పంచాయతీ

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పంచాయతీ స్వయం సమృద్ధి, సదుపాయాలు, సుపరిపాలన గ్రామంగా అవార్డు అందుకుంది. ఇక్కడి పంచాయతీని కంప్యూటరీకరించారు. ఈ–పంచాయతీ సేవలు అందిస్తున్నారు. గ్రామానికి సంబంధించిన లావాదేవీలన్నీ (ట్రేడ్ లైసెన్స్, గృహనిర్మాణ, మ్యుటేషన్, లేఅవుట్, జనన, మరణ ధృవీకరణపత్రాలు) ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. నిరంతర విద్యుత్‌తోపాటు రోడ్లపై వీధిదీపాల ఏర్పాటు చేశారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి



ప్రజలందరి సహకారంతో ప్రభుత్వ ప్రోత్సాహంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలుకు చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నాం. రెండు అంశాల్లో పంచాయతీకి అవార్డులు దక్కడం సంతోషంగా ఉంది.

– వీరగోని సుజాత, సర్పంచ్ గర్రెపల్లి

జూన్‌లోగా వృద్ధాశ్రమం పూర్తి

కలెక్టర్ సంగీత



సుల్తానాబాద్‌లో వృద్ధాశ్రమం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

సుల్తానాబాద్: పట్టణంలో చేపడుతున్న వృద్ధాశ్రమాన్ని జూన్‌లోగా పూర్తి చేయాలని కలెక్టర్ సంగీత కాంట్రాక్టర్‌కు సూచించారు. సుల్తానాబాద్‌లో బుధవారం ఆమె పర్యటించారు. వృద్ధాశ్రమంతోపాటు స్వప్నకాలనీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఆశ్రమంలో అదనపు టాయిలెట్స్, ప్రహరీ నిర్మించాలని అధికారులకు సూచించారు. కంటివెలుగు క్యాంపు వద్ద ఉన్న రీడింగ్ గ్లాస్‌ల స్టాక్‌పై పర్యవేక్షణ ఉండాలని, ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు వచ్చిన తరువాత ఆశాకార్యకర్తల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలిపారు. కంటివెలుగు ద్వారా ఇప్పటివరకు 2,22,442 మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించామని, 36,023 మందికి రీడింగ్ కళ్లద్దాలు, 15,109 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. డాక్టర్ శ్రీజ, తహసీల్దార్ యాకన్న, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, హెచ్ఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్ఎంలు ఉన్నారు.

బస్తీ దవాఖానా పనుల పరిశీలన

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రం శివారు రంగంపల్లిలో ఏర్పాటు చేస్తున్న బస్తీ దవాఖానా ఆధునీకరణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. పాత పంచాయతీ భవనాన్ని రూ.13లక్షలతో ఆధునీకరించి బస్తీ దవాఖానా ఏర్పాటు చేసే పనులు పురోగతిలో ఉన్నాయి. అన్ని వసతులు కల్పించి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు అందుబాటులోకి తేవాలని పంచాయతీ రాజ్ డీఈఈ శంకరయ్యను ఆదేశించారు. ఏఈ రాజ్ కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రాలను వినియోగించుకోండి

జిల్లాలో ప్రారంభించిన మూడు ఆరోగ్యమహిళ కేంద్రాలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మంగళవారం మహిళలకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, డీఈ కే.దేవేందర్, ఏఈ సతీశ్, అధికారులు పాల్గొన్నారు.

‘ఖని’కి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు

- ఇకనుంచి ఇక్కడే భూముల రిజిస్ట్రేషన్లు
- తాత్కాలికంగా సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఆఫీస్



ఐటీపార్కు కోసం తాత్కాలిక సింగరేణి గెస్ట్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న జీఎం, ఎమ్మెల్యే

గోదావరిఖని: గోదావరిఖనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరైంది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకనుంచి పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలాలకు చెందిన భూములకు ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయనున్నారు. తాత్కాలికంగా సింగరేణికి చెందిన గెస్ట్ హౌస్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి సేవలు అందించనున్నారు. ఇప్పటివరకు జిల్లాకేంద్రంలోనే రిజిస్ట్రేషన్లు చేసేవారు. అది దూరభారంతో కూడుకున్న పని కావడంతో స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రైతులు, ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఒక్కొక్కటిగా..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో త్వరలో ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. శాశ్వత భవనం నిర్మించేవరకూ సింగరేణి బీగెస్ట్‌హౌస్‌ను ఉపయోగించనున్నారు. శాశ్వతభవనం కోసం కార్పొరేషన్ కార్యాలయం వెనక ఉన్న ఎకరం ఖాళీ స్థలాన్ని గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ మెడికల్ కళాశాల ఉంది. ఇందులో 24గంటల వైద్య సేవలు అందుతున్నాయి. ఈ కళాశాలకు సింగరేణి సంస్థ రూ.500 కోట్లు కేటాయించింది. తాజాగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కూడా మంజూరుకావడంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

ప్రజలకు చేరువగా సేవలు

ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం. సీఎం కేసీఆర్ సహకారంతో మెడికల్ కళాశాల సాధించాం. ఐటీపార్కు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇప్పుడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కానుంది.

– కోరుకంటి చందర్, ఎమ్మెల్యే







వీడలేక.. వీడ్కోలు..!

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి పరీక్ష రాసిన విద్యార్థులు బయటకు వచ్చి తోటి స్నేహితులతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వీడలేక.. వీడ్కోలు చెప్పుకున్నారు. హాస్టళ్లలో ఉన్నవారు ఇళ్లకు బయల్దేరారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, చివరి రోజు 5,172 మంది విద్యార్థులకు 152 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు.

– సాక్షి, పెద్దపల్లి





విద్యార్థులందరూ మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న డీఈజీ మాధవి

రామగుండం: మానవాళి మనుగడ సాధించాలంటే విద్యార్థులు తమ పుట్టిన రోజున మొక్క నాటాలని డీఈవో మాధవి సూచించారు. అంతర్గాం మండలం ముర్మూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ‘గోటూనేచర్’ ప్రకృతి శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే అడవుల రక్షణ, మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. జాతీయ హరితదళం రాష్ట్ర ప్రాజెక్టు అధికారి బి.విద్యాసాగర్, జిల్లా సమన్వయకర్త బి.రవినందన్‌రావు, కన్నాల ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ రహ్మతుల్లా హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఖని'లో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయండి



హోంమంత్రికి వినతిపత్రం ఇస్తున్న చందర్

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర హోంమంత్రి మహమ్మద్ అలీని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. నిత్యం వందలాది మహిళలు తమ సమస్యలపై పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారని, వారికోసం ప్రత్యేక స్టేషన్ ఉంటే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మేడిపల్లిలో కబరిస్తాన్ నిర్మాణానికి సింగరేణి భూమి కేటాయించేలా చూడాలన్నారు.

గెస్ట్‌హౌస్‌ను ఐటీపార్క్‌కు కేటాయించొద్దు

గోదావరిఖని: స్థానిక సింగరేణి బీగెస్ట్‌హౌస్‌ను ఐటీ పార్క్‌కు కేటాయించొద్దని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అర్జీ–1 డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం సింగరేణి ఆస్తులను చేస్తున్నారన్నారని, ఇప్పటికే కంపెనీకి చెందిన క్వార్టర్లను, స్కూల్ బిల్డింగ్ అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారన్నారు. ఇక్కడ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ అప్రెంటిస్ షిప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృదద్ధి మంత్రిత్వశాఖ, రీజినల్ డైరెక్టర్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ప్రభుత్వ డైరెక్టర్ ఉపాధి కల్పనశాఖ సంయుక్తంగా బుధవారం జాతీయ అప్రెంటిస్ షిప్ అవగాహన సదస్సు నిర్వహించారు. అప్రెంటిస్‌షిప్ పొందాలనుకునే వారు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ మార్వల్‌దాస్, డిగ్గేవాడి కోరారు. ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పారిశ్రామిక యజమాన్యాలు, ఐటీఐకి చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఏడీ విజయ్ కుమార్, శ్రీనివాస రెడ్డి, ఎస్‌వీకే నగేశ్, సీతారాములు, తిరుపతి రావు, ప్రిన్సిపాల్ నర్సింహాచారి తదితరులున్నారు.

అల్లూరు యూపీహెచ్‌సీ తనిఖీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ అల్లూరులోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను బుధవారం కాయకల్ప బృందం సభ్యుడు శ్రీరాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయితో కలిసి తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి కాయకల్పపై అవగాహన కల్పించారు. నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్స్‌ను ఎలా నిలబెట్టుకోవాలనే విషయాన్ని వివరించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ అనిల్, అల్లూరు యూపీహెచ్‌సీ డాక్టర్ నీలిమ, హెల్త్ సూపర్వైజర్ సీతారామయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోదాముల్లో గోల్‌మాల్..!

- పక్కదారి పడుతున్న సబ్సిడీ బియ్యం
- లారీలనే మాయం చేస్తున్న వైనం
- గోదాం నుంచి మిల్లుకు.. మిల్లు నుంచి గోదాంకు
- అంతా అధికారుల కనుసన్నల్లోనే..?
- గాలింపు చర్యలకు మూడు టీంలు



సుల్తానాబాద్‌లో మూసివేసి ఉన్న గోదాం



మంగళవారం ట్రక్ షీట్లు చించి వేయగా.. వాటిని అంటిస్తున్న అధికారులు

సుల్తానాబాద్: జిల్లాలో ప్రజాపంపిణీ బియ్యం సరఫరాకు మూడు గోదాములున్నాయి. వీటి ద్వారా ప్రతినెలా 6,27,841 క్వింటాళ్ల బియ్యం రేషన్‌షాపులకు పంపిణీ చేస్తారు. డీలర్లు తమ కోటాకు అనుగుణంగా డీడీలు చెల్లించి ప్రతినెలా 18లోగా మండల రెవెన్యూ కార్యాలయంలో అందిస్తే వారు ఆర్‌ఓలు జారీ చేస్తారు. అయితే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉచితంగా బియ్యం అందిస్తుండడంతో డీడీలు చెల్లించడం లేదు. అప్పటినుంచే బియ్యం పంపిణీ జిల్లాలో పక్కదారి పడుతోంది. గోదాములకు చేరాల్సిన లారీలనే కొందరు అక్రమార్కులు దారిమళ్లిస్తూ బియ్యం మాయం చేస్తున్నారు. సోమవారం రాత్రి గోదాముకు చేరాల్సిన లారీలు ఏకంగా రైస్‌మిల్లులకు చేరాయి. సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులు సోదాలు చేసి ఈ విషయాన్ని బహిర్గతం చేశారు.

పక్కదారి పడుతోందిలా..!

వాస్తవానికి గోదాం నుంచి రేషన్ సరుకులను వేబ్రిడ్జిపై తూకం వేసి ఇస్తారు. అయితే జిల్లాలోని ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఎక్కడా వేబ్రిడ్జిలు లేవు. కేవలం చిన్నపాటి తూకాలు మాత్రమే ఉన్నాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో 50 కిలోల చొప్పున బియ్యాన్ని సంచుల్లో నింపి డీలర్లకు సరఫరా చేస్తున్నారు.

రెండు లారీల బియ్యం మాయం

సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల స్టేజ్ వన్ గోదాం నుంచి, పౌర సరఫరాల శాఖ ఇక్కడి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు సోమవారం ఐదు లారీల్లో బియ్యం లోడ్ పంపించింది. ఇందులో 420 బస్తాల చొప్పున ఉన్న మూడు లారీలు మాత్రమే గోదాంకు చేరాయి. వాటిని పలు రేషన్‌షాప్‌లకు సరఫరా చేశారు. అయితే 450 బస్తాలున్న ఒక లారీ, 495 బస్తాలు (225 క్వింటాళ్లు)న్న మరో లారీ, 495 బస్తాలున్న (247.50 క్వింటాళ్లు) ఇంకో లారీని దారి మళ్లించారు. ఆ బియ్యాన్ని ఏకంగా ఓ రైస్‌మిల్లులో అన్‌లోడ్ చేసినట్లు అనుమానంతో అధికారులు సోదాలు చేస్తున్నారు. వీటితోపాటు ఎఫ్‌ఆర్‌కె బియ్యం 29.55క్వింటాళ్లు, బీపీటీ 10.96క్వింటాళ్లు గోదాము నుంచి మాయమైనట్లు అధికారులు గుర్తించారు.

గుర్తించేందుకు మూడు టీంలు

సుల్తానాబాద్‌లో మాయమైన లారీలతోపాటు బియ్యం గుర్తించేందుకు విజిలెన్స్ ఎస్పీ రామారావు ఆధ్వర్యంలో మూడు టీంలను ఏర్పాటు చేశారు. పట్టణంతోపాటు మండలంలోని పలు రైస్ మిల్లులను విజిలెన్స్ సీఐలు అనిల్ అరుణ్ ప్రసాద్, ఎస్సై నారాయణబాబు తనిఖీ చేశారు. తాత్కాలిక ఉద్యోగి శ్రీనివాస్ రెడ్డి సొంత గ్రామమైన జమ్మికుంట మండలం కల్లెపల్లెకు వెళ్లి విచారించారు. లారీలతోపాటు డ్రైవర్లను తాత్కాలిక పద్ధతిపై నియమించుకుని డాటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్ రెడ్డి కోసం గాలిస్తున్నట్లు సమాచారం. గోదాం ఇన్‌చార్జి వెంకటరాజాంకు సంబంధం లేకుండానే బియ్యం మాయమైనట్లు చెబుతున్నారు.

స్టాక్‌లోనూ తేడా..?

కొన్నిచోట్ల రేషన్ డీలర్లు ప్రతినెలా మొదటివారంలో ఇవ్వాల్సిన బియ్యాన్ని 20నుంచి అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అది కూడా రెండు, మూడు రోజులకోసారి ఇస్తుండటంతో 20 శాతం పంపిణీ చేయకముందే మరో నెల కోటా వస్తోంది. ఇలా ఒకనెల బియ్యం.. మరో నెలలో కలుపుతూ ఏడాదికి ఎంతలేదన్నా రెండు, మూడు కోటాల బియ్యాన్ని మింగేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సుల్తానాబాద్ గోదాములో స్టాక్ నిల్వల్లో తేడా రావడమే ఇందుకు నిదర్శనమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్‌ఓలే మారుతాయ్

బియ్యం కుంభకోణం పకడ్బందీ ప్రణాళికతో.. హైటెక్ తరహాలో సాగుతుందన్న ఆరోపణలున్నాయి. మండలస్థాయి స్టాక్ పాయింట్లలో వివిధ మార్గాల ద్వారా ప్రతినెలా ఎన్ని బియ్యం మిగులుతాయనే విషయం సంబంధిత గోదాం ఇన్‌చార్జికి అవగాహన ఉంటుంది. అంతే పరిమాణంలో రేషన్ బియ్యాన్ని స్టేజ్–1 గోదాం నుంచి స్టేజ్–2 గోదాంకు తీసుకురాకుండానే ఆర్‌ఓలను ఎంఎల్‌ఎస్ పాయింట్ల స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటారని ఆరోపణలున్నాయి. బియ్యం అక్రమంగా దారి మళ్లించడం, రవాణా అంతా కూడా అధికారులకు తెలిసే జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా దారిమళ్లిన రెండు లారీల వెంట రూట్ ఆఫీసర్ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై డీఎస్‌ఓ వెంకటేష్ వివరణ కోరగా పూర్తిస్థాయి నివేదికను అదనపు కలెక్టర్‌కు అందించామని, తెలిపారు. రెండు లారీల బియ్యం దారి మళ్లిన విషయమై డాటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్ రెడ్డిపై, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ లారీల రవాణా చేసే కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ సంగీత ఆదేశించారని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. గోదాం తాత్కాలిక ఇన్‌చార్జి వెంకటరాజంను సస్పెండ్ చేశామని తెలిపారు.

రంజాన్ తోఫా వచ్చేశాయ్..!

- జిల్లాకు చేరిన 5వేల గిఫ్ట్ ప్యాకెట్లు
- మండలాల వారీగా పంపిణీకి కసరత్తు



జిల్లాకు చేరిన రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లు

పెద్దపల్లి రూరల్: రంజాన్ పండుగ సమీపిస్తోంది. జిల్లాలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం ఏటా అందిస్తున్నట్టే ఈ ఏడాది రంజాన్ పండుగ కానుకగా దుస్తుల (కుర్తా, పైజామా, సారీడ్రెస్ మెటీరియల్)తో కూడిన 5వేల కిట్‌లు బుధవారం జిల్లాకు చేరుకున్నాయి.

ఒక్కో కుటుంబంలో ముగ్గురికి..

ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం రంజాన్ తోఫా అందిస్తోంది. ప్రభుత్వం అందించే కిట్ లో ఒక్కో కుటుంబంలో ముగ్గురు సభ్యులకు సరిపడా దుస్తులు ఉంటాయని అధికారవర్గాలు తెలిపాయి. జిల్లాలోని మండలాల తహసీల్దార్లకు వాటిని అందించి లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ద్వారా అందించనున్నారు. జిల్లాలో పెద్దపల్లి, మంథని నియోజకవర్గాలకు 1500 కిట్లు చొప్పున, రామగుండం నియోజకవర్గానికి 2వేల కిట్లను పంపిణీ చేయనున్నారు. ముస్లిం మైనార్టీలకు రంజాన్‌తోఫా అందించడంతో పాటు ఇఫ్తార్ విందులను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

లబ్ధిదారులకు అందిస్తాం

జిల్లాలో నిరుపేద మైనార్టీలకు ప్రభుత్వం రంజాన్ తోఫా అందిస్తోంది. అందుకు అవసరమైన కిట్లను మండలాల వారీగా కేటాయించాం. తహసీల్దార్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తాం. ఇఫ్తార్ విందులు కూడా ఏర్పాటు చేస్తాం.

–మెహరాజ్ మహ్మద్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి

సర్కారు బడుల బలోపేతం

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథనిలోని జెడ్పీ బాలుర పాఠశాలలో వంటగదిని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నాడు అధికారంలో ఉన్నవారు ఈ ప్రాంత విద్యార్థుల చదువుపై ఆలోచన చేయలేదన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాత్రం ఢిల్లీ యూనివర్సిటీలో చదుకున్నారని, ఇక్కడి పిల్లల కోసం ఇప్పటివరకు ఆలోచించడం లేదని పేర్కొన్నారు. ప్రజలను ఓటువేసే యంత్రాలుగానే గుర్తిస్తున్నారని విమర్శించారు. మంచి నాయకత్వాన్ని ఎన్నుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రారంభించానని, విద్యార్థులకు వసతులు, మినరల్ వాటర్, రహదారి సౌకర్యం కల్పించానని గుర్తు చేశారు. 40 ఏళ్ల తర్వాత మంథనికి డిగ్రీ కళాశాల మంజూరైతే దూరప్రాంతంలో నిర్మించారని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం ఆకట్టుకుంది. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత ఉన్నారు.

'ప్రమాణం చేద్దాం రా..'

- తనపై మంత్రి చేసిన ఆరోపణలన్నీ అసత్యాలే..
- మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు 'అడ్లూరి' సవాల్



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తాను పార్టీ టికెట్లు అమ్ముకుని కార్యకర్తల డబ్బుతో పబ్బం గడుపుతున్నానని మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమని కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. అవన్నీ అసత్య ఆరోపణలని తాను శివాలయంలో తడిబట్టలతో ప్రమాణం చేస్తానని, మంత్రి కొప్పుల ఈశ్వర్ నడిపిస్తున్న కొప్పుల చారిటబుల్ ట్రస్టు నిర్వహణ న్యాయంగా సంపాదించిన డబ్బులతోనే నడిపస్తున్నానని ప్రమాణం చేస్తారా..? అని ప్రశ్నించారు. ధర్మారం మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి తనపై అసత్యపు ఆరోపణలు చేయడం.. దుర్భాషలాడడం సరికాదని, తామిద్దరం స్థానికేతరులమేనని, ఇక్కడి ప్రజల ఆదరణతోనే నాయకులుగా ఎదిగామని పేర్కొన్నారు. 2004 నుంచి 2023 వరకు అవినీతి పాల్పడలేదని, ట్రస్టును కష్టపడి సంపాదించిన డబ్బుతోనే నడిపిస్తున్నానని మంత్రి గోదావరిఖనిలో నిర్మించిన అమ్మవారి గుడిలో ప్రమాణం చేస్తారా..? అని సవాల్ విసిరారు. తాను ఏప్రిల్ 3న వెల్గటూర్ మండలం కోటిలింగాల ఆలయంలో ప్రమాణం చేయటానికి సిద్ధమని ప్రకటించారు. పార్టీ సీనియర్ నాయకులు మద్దెల రవీందర్, మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, బ్లాక్–2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బొల్లి స్వామి, లావుడ్య రూప్లానాయక్ ఉన్నారు.

ఆరోపణలు నిజమే..

మంత్రి కొప్పుల ఈశ్వర్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై చేసిన ఆరోపణలన్నీ నిజమేనని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీలో బుధవారం పలు అభివృద్ధి పనులను జీఎం కే.నారాయణ భూమిపూజ చేశారు. రూ.37లక్షలతో నిర్మించనున్న డీజిల్ బంకర్, వ్యూపాయింట్ కోసం రూ.7లక్షలు, రూ.38లక్షలతో సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్ రావు, సీఎంఓఏఐ పోనోగోటి శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, మేనేజర్ గోవింద్ రావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఎస్‌వీరావు, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భాస్కర్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బార్ అసోసియేషన్‌కు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా కోర్టులో జరిగిన ఎన్నికల్లో లకిడి భాస్కర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రెడ్డి శంకర్, ఉపాధ్యక్షుడిగా డీవీఎస్.మూర్తి, జాయింట్ సెక్రటరీగా కోటగిరి శ్రీనివాస్, కోశాధికారిగా రాచూరి శ్రీకాంత్, లైబ్రరీ కార్యదర్శిగా బొంకూరి సంతోష్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీగా సత్యనారాయణ, మహిళా ప్రతినిధిగా రమాదేవి, కార్యవర్గ సభ్యులుగా కుడిక్యాల శ్రీధర్, గణేశ్, రమేశ్ ఎన్నికయ్యారు. వీరికి సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

పెద్దపల్లి రూరల్: మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి ఒకరోజు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు. పెద్దపల్లిలోని కొంతంవాడకు చెందిన రవీందర్, మహారాష్ట్ర గడ్చిరోలికి చెందిన ముల్కరి రోహిత్ మధుకర్, సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌కు చెందిన కల్వల వినయ్‌కు జూనియర్ సివిల్ జడ్జి రాణి ఒకరోజు జైలుతో పాటు రూ.3వేల జరిమానా విధించారని చెప్పారు.

ఎన్టీపీసీకి పోలీస్ క్వార్టర్ల బకాయిలు..?

- రూ.3,53,321 చెల్లించాలని ఉన్నతాధికారులకు నోటీసులు

జ్యోతినగర్ : ఎన్టీపీసీ రామగుండం సంస్థ టెంపరరీ టౌన్ షిప్‌లో కేటాయించిన పోలీసుల నివాసాలకు అద్దె బకాయిలు పెరిగిపోయాయని వెంటనే చెల్లించాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఎన్టీపీసీ హెచ్‌ఆర్ విభాగం నుంచి నోటీస్ జారీచేశారు. టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఏ,బీ,సీతో పాటు పలు కేటగిరిల్లో నివాస గృహాలున్నాయి. సంస్థలో పనిచేస్తున్న వారితో పాటు కాంట్రాక్టర్లు, రెవెన్యూ, పోలీస్ విభాగాలకు చెందిన పలువురికి నివాస గృహాలను అద్దె ప్రాతిపదికన మంజూరు చేశారు. కొంతమంది సిబ్బంది ఈ ప్రాంతంలో ఉద్యోగం చేసే సమయంలో పొందిన క్వార్టర్‌ను ఖాళీ చేయకుండా ఇతర ప్రాంతాలకు బదిలీకాగా కొత్తగా బదిలీపై వచ్చిన వారికి క్వార్టర్లను కేటాయించలేకపోయారు. ఈ క్రమంలో ఏ కేటగిరి క్వార్టర్‌కు ఓ కానిస్టేబుల్ 19 నెలల అద్దె, విద్యుత్ బకాయిలు కలిపి రూ.1,53,796 (ఫిబ్రవరి–23వరకు), బి కేటగిరిలో ఉన్న ముగ్గురు కానిస్టేబుళ్లు రూ.1,70,970, సీ కేటగిరిలో ఉన్న ఓ పోలీస్ అధికారి రూ.28,555 అద్దె చెల్లించాలంటూ నోటీసులో పేర్కొన్నారు. ఐదు క్వార్టర్లకు సంబంధించి అద్దె, విద్యుత్ బకాయిలు మొత్తం రూ.3,53,321 చెల్లించాలని రామగుండం పోలీస్ కమిషనరేట్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, పెద్దపల్లి, రామగుండం సర్కిల్ కార్యాలయాలకు చెల్లింపు నోటీసు వివరాల ప్రతులను పంపించినట్లు విశ్వసనీయ సమాచారం.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంక్‌కు కృషి

- బల్దియాలో స్వచ్ఛ మషాల్ మార్చ్
- మేయర్ బంగి అనిల్ కుమార్
- పాల్గొన్న అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్



మషాల్ మార్చ్‌లో మాట్లాడుతున్న మేయర్, చిత్రంలో అదనపు కలెక్టర్

కోల్‌సిటీ(రామగుండం): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి ఉత్తమ ర్యాంకు తేవడమే లక్ష్యమని మేయర్ బంగి అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛమషాల్ మార్చ్ నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ పాల్గొన్నారు. గోదావరిఖని చౌరస్తా వరకు ప్లకార్డులతో మార్చ్ నిర్వహించారు. సాంస్కృతిక సారథి కళాకారులు స్వచ్ఛత, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై పాటలు పాడి అవగాహన కల్పించారు. మేయర్ మాట్లాడుతూ నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ఒకసారి ఉపయోగించిన ప్లాస్టిక్ వస్తువులను మరోసారి వాడొద్దని కుమార్ దీపక్ సూచించారు. కమిషనర్ సుమన్‌రావు మాట్లాడుతూ చెత్తను రోడ్లపై, కాలువల్లో పడేయొద్దని కోరారు. కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవితాసరోజినీ, దుబాసీ లలిత, అడ్డాల స్వరూప, బాలరాజ్ కుమార్, బొడ్డు రజిత, డెప్యూటీ కమిషనర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్ పేర్కొన్నారు. జీజీహెచ్ ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. త్వరలోనే సిటీస్కాన్‌తో పాటు 85 పడకల భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గైడ్‌లైన్స్, స్టాండర్స్ ప్రకారం పేషెంట్ల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసి ఓపీ కార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. వెంటిలేటర్, న్యూరో సంబంధిత కేసులను మాత్రమే రెఫర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మైక్రోబయాలజీ, పథాలజీ, ఫోరెన్సిక్ తదితర ల్యాబ్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. జిల్లాలోని ప్రజలు ఆస్పత్రిలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు ఎ.శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య, అనూష, అశోక్, వేణుమాధవ్, రాజు, శివమణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజన్న సన్నిధిలో రామయ్య పెళ్లి



విద్యుత్ దీపాల వెలుగుల్లో రాజన్న ఆలయం



రాజన్న చెంతకు తరలివస్తున్న భక్తులు

- భారీగా తరలివస్తున్న శివపార్వతులు
- కిక్కిరిసిన రాజన్న ఆలయం
- మున్సిపల్ పక్షాన పట్టువస్త్రాలు
- కల్యాణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు

వేములవాడ: రాజన్న సన్నిధిలో గురువారం ఉదయం 11.55 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరిపేందుకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచే వేలాదిగా శివపార్వతులు వేములవాడకు చేరుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. శివపార్వతుల పూనకాలు, హిజ్రాల నృత్యాలతో వేములవాడ పట్టణం సందడిగా మారింది. కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు షామియానాలు వేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చైర్మన్ చాంబర్ వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామివారల కల్యాణోత్సవం జరగనుంది. ఇందుకు రూ.16 లక్షలతో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఈ రాజేశ్ తెలిపారు. 2 లక్షల లీటర్ల తాగునీటి పాకెట్లు అందుబాటులో ఉంచారు. దాతల సాయంతో 5 వేల లీటర్ల మజ్జిగను భక్తులకు అందజేయనున్నారు. 11 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆటోల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, స్వామివారలను భక్తులు దర్శించుకునేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవం కన్నులపండుగా జరగనుంది. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

మున్సిపల్ పక్షాన పట్టువస్త్రాలు

రాజన్న ఆలయంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి స్థానిక మున్సిపల్ పాలకవర్గం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేస్తారు. గురువారం ఉదయం 8 గంటలకు చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు కమిషనర్ అన్సారీ బుధవారం తెలిపారు.

వేములవాడలో వింతైన తంతు

రామన్న పెళ్లి రోజున రాజన్నతో వివాహమాడటం ఇక్కడో వింతైనతంతు. శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం మామూలే. కానీ ఈ గుడిలో రాజన్నను భర్తగా భావించి శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు, కల్యాణమాడుతారు. బాల్యం నుంచే శివపార్వతులుగా మారుతున్న బాలికలు సైతం ఉన్నారనడంలో అతిశయోక్తిలేదు. అయితే తాము అనారోగ్యం బారిన పడటంతో శివపార్వతీగా మారుతానని మొక్కుకున్నామని, ఆరోగ్యం బాగుపడిందని, అందుకే శివపార్వతీగా మారామని పలువురు చెబుతున్నారు.

శివపార్వతులకు సర్వం సిద్ధం

కల్యాణోత్సవంలో పాల్గొనే శివపార్వతులకు శివుడిని పెళ్లి చేసుకునేందుకు అవసరమైన వస్తువులను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుంటే.. లింగభేదం లేకుండా కాళ్లకు రాగి మెట్టెలు, చేతులకు రాగి వస్తువులు, చేతిలో త్రిశూలం పట్టుకుని, నెత్తిన జీలకర్ర పెట్టుకుని, బాసింగాలు కట్టుకుని, మెడలో రుద్రాక్ష వేసుకున్న శివపార్వతులు శివుడిని పెళ్లాడటం ఈ క్షేత్రంలో ఆనవాయితీగా వస్తోంది. కాగా శివపార్వతుల కోసం ఆలయ ప్రాంతం, జాతరాగ్రౌండ్ తదితర ప్రాంతాల్లో రాగి వస్తువులు, రుద్రాక్ష, త్రిశూలం, లింగాలు, గంటలు, బాసింగాలు అమ్మేందుకు బుధవారం అన్ని సిద్ధంగా ఉంచారు.

ధరలు పెంచిన ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణా రావు



బాలరాజుపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న విజయరమణా రావు

జూలపల్లి: అడ్డగోలుగా ధరలు పెంచుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణ రావు అన్నారు. మండలంలోని బాలరాజుపల్లె గ్రామంలో హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. వాడవాడలా పాదయాత్ర చేస్తూ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకపోవడమేకాకుండా.. బస్సు, కరెంటు చార్జీలు పెంచి పేదలను వంచిస్తోందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు చేసిందేమీలేదని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నాయకులు కాంతయ్య, బొజ్జ శ్రీనివాస్, కొమ్మ పోచాలు, పెరుక తిరుపతి, మాంకాలి అంజయ్య, రవీందర్‌రావు, దేవేందర్‌రెడ్డి, తీగెల శ్రీకాంత్, మానుమండ్ల శ్రీనివాస్, బండి స్వామి తదితరులు పాల్గొన్నారు.